# సూపర్ సిండ్రోమ్

గురువారం.... సాయంత్రం ఆరు కావస్తోంది. కూరగాయల సంచి తీసుకుని బైటికెళ్ళబోతుంటే నా కూతురు మధు "అమ్మా నన్నూ రమ్మంటావా" అంది. అదిప్పుడు ఇంటర్ రెండో సంవత్సరంలో ఉంది.

"వద్దులేమ్మా. చదువుకో. నాకలవాటేగా. ఓ అరగంటలో తిరిగొచ్చేస్తాను" అన్నాను.

మధు మనోహరంగా నవ్వింది. "ఎన్నిసార్లు చెప్పినా వినవుకదమ్మా. బడీ చౌడీలో కూరగాయలు చౌక అని వెళ్తావు. కానీ ఎంత దూరమో ఆలోచించవెందుకు? వెళ్ళేటప్పుడు ఆటో... మరలా వచ్చేటప్పుడు ఆటో. ఆ కిరాయి కలుపుకుంటే చౌకెలా అవుతాయి?"

ప్రతి గురువారం మా యింట్లో జరుగుతున్న సంతే కాబట్టి సమాధానం చెప్పకుండా గడప దగ్గరున్న చెప్పులు తొడుక్కుంటున్నప్పుడు మరలా తనే అంది. "యింకో వారం ఆగితే చాలు. మనింటి పక్కనే ఫుడ్ వరల్డ్ ఓపెన్ అవుతోంది. ఎంచక్కా మనం అక్కడే కావాల్సిన వస్తువులన్నీ కొనుక్కోవచ్చు... కూరగాయల్తో సహా"

"బడీ చౌడీ అలవాటైపోయిందమ్మా... అక్కడి మనుషులు కూడా"

"అలవాటేమిటి నీ చాదస్తం కాకపోతే. మనం ఇప్పుడు చూసుకోవాల్సింది సౌకర్యం. బియ్యం, కంది పప్పు, కూరగాయలు, పండ్లు... ఒకటనేమిటి సమస్తం ఒకే చోట దొరుకుతాయి. నీట్‌గా ప్యాక్ చేసి అమ్ముతారు. ధరలూ అందుబాటులోనే ఉంటాయి"

నేను ఆటో మాట్లాడుకుని బడీచౌడీలోని కూరగాయల మార్కెట్ దగ్గర దిగాను.

నన్ను అల్లంత దూరంనుంచే చూసిన రావులమ్మ మొహం నిండా సంతోషపు విరబూత... కొత్తిమీర కట్ట ఎంతకిస్తావని అడుగుతున్న స్త్రీని పట్టించుకోకుండా నా వైపే చూస్తోంది. ఆ చూపు ఆత్మీయ అయస్కాంతంలా తన వైపుకు బలంగా లాగేస్తూ...

నేను దగ్గరకు రాగానే "ఎన్నిదినాలైందమ్మా నిన్ను సూసి. మొన్నటి గురోరం రాకపోతే ఎంత కంగారు పడ్డాను తెలుసా. రాతిరి తొమ్మిద్దాటినా సువ్వొస్తావేమోనని ఎదురుసూశానంటె నమ్ము. ఏదైనా వూరెల్లావా" అంది.

ఆమె ఎదురుగా పరిచి ఉన్న గోనె పట్టామీద కొత్తిమీర, కరివేపాకు, పుదీనా కట్టలు పేర్చి ఉన్నాయి. నాక్కావల్సినవి ఏరుకుని సంచిలో వేసుకుంటూ "ఎక్కడికీ వెళ్ళలేదు రావులమ్మా" అన్నాను.

నా వైపు పరీక్షగా చూసింది. "ఏంటమ్మా సిక్కిపోయావు? జబ్బు పడ్డావా?" అంది.

"మొన్న నాలుగు రోజులు జ్వరం పడ్డాను"

"అందుకే పోయిన గురోరం వచ్చుండవు. నేనదే అనుకున్నా. కూరగాయలు కొనకున్నా పతి గురోరం పూలు కొండానికైనా తప్పకుండా రావాలి కదా రాలేదేమిటీ అని"

"గురువారం సాయిబాబాకి, శుక్రవారం అమ్మవారికి పూలదండలు తొడిగి పూజ చేయకపోతే మనశ్శాంతిగా ఉండదు. పోయినవారమే అనారోగ్యం వల్ల చేయలేకపోయాను. సర్లే. నీ కూతురి కాపురం ఎల్లా ఉందో చెప్పు"

"ఏం సెప్పమంటావు తల్లీ...'మరీ సిన్న పిల్ల. ఇపుడు దానికి పెల్లేమిటి' అని సువ్వు సెప్తున్నా యినకుండా పెల్లి సేసి దాని గొంతు కోశాను. రోజూ తాగొచ్చి కొడ్తున్నాడట... సచ్చినోడు. అపురూపంగా సూస్కున్న పిల్లని ఆడి ఎదాన షోశా. పాతిక యేలు తెమ్మంటాడట. పెల్లికి సేసిన ఇరవైయేల బాకీ తీర్చడానికే రెక్కలు ముక్కలు సేసుకుంటున్నా. పాతిక యేలంటే ఎక్కన్నుంచి తేను? నాకేమైనా

అస్తాపాస్తా... అమ్మైనా దాని కాపురం నిలబెడ్దామంటే" పైట చెంగుతో కన్నీళ్ళు తుడుచుకుంది.

నాకేం చెప్పాలో తోచలేదు.

"నీకు తెల్సుగా మా యింటి పరిస్తితి. పెల్లయిన రెండేల్లకే నా మొగుడు సచ్చినోడు నన్నొదిలేసి మరో దాంతో పోతే, మగరాయుడిలా సెమటోడ్చి బతుకుని నెట్టుకొత్తున్నా. పెల్లి సేసేస్తే ఓ బాద్యత తీరిపోతుందనుకున్నా కానీ అదే నా మెడకు గుదిబండలా తగులు కుంటుందనుకోలేదు" మరోసారి ముక్కు తుడుచుకుంది.

"మీ చుట్టాల్లో అబ్బాయేగా. పెద్దవాళ్ళని పిలిపించి పంచాయతీ పెట్టించు. పెళ్ళప్పుడు పది వేల కట్నానికి ఒప్పుకుని ఇప్పుడు మరో పాతిక వేలడగడానికి నోరెలా వచ్చింది? నువ్వు వూర్కోకు" అన్నాను.

"ఏదో ఓటి సేయకపోతే ఆడు దాన్ని వదిలేసేలా ఉన్నాడు. ఏదైనా సేద్దామంటే కూతురి కాపురమాయె. కడుపు సింసుకుంటె కాల్లమీదే కదా పడేది" అని "నువ్వు కన్పింసకపోతే పేనం అగ్గగ్గలాడిపోద్ది. మర్సిపోకు" అంది నేనిచ్చిన నోటు తీసుకుని చిల్లర తిరిగిస్తూ.

నాలుగడుగులు నడిచి కూరగాయల బండి దగ్గరకెళ్ళా.

"అమ్మా... బాగున్నారా... కన్పడక శానా రోజులైంది" ఒక వైపు వంకాయలు తూచి బుట్టలో వేస్తూనే నా వైపు అభిమానంగా చూస్తూ అన్నాడు కనకయ్య.

కనకయ్య వయసు డెబ్బయ్‌కి దగ్గరగా ఉంటుంది. మనిషి బద్దలా ఉండటం వల్ల నడుం దగ్గర ఒంగిపోయాడు. కళ్ళలో అనంతమైన దిగులు వేలాడుతో ఉంటుంది. ఒకప్పుడు బాగా బతికిన వాడేనట. ఒంగోలు దగ్గర మూడెకరాల పొలాన్ని సాగు చేసుకుని గౌరవంగా బతికాడట. పిల్లలు పెద్దయ్యాక ఆస్తులు లాగేసుకుని యింట్లోంచి తరిమేస్తే ఉన్న వూళ్లో తలెత్తుకోలేక హైద్రాబాద్ వచ్చి కాయగూరలు అమ్మటం ప్రారంభించాడట. మొదట్లో బండి మీద యింటింటికీ

తిరిగి అమ్మినాయన ఇపుడు ఓపిక సన్నగిల్లి బడీ చౌడీలో ఓమూల బండిని పెట్టుకుని వ్యాపారం చేసుకుంటున్నాడు.

గత ఏడాదిగా నేను కనకయ్య దగ్గరే కూరగాయలు కొంటున్నా.

"ఈ వయసులో ఎందుకు నీకీ కష్టం? హాయిగా కొడుకుల దగ్గరకెళ్ళి మనవళ్ళతో కాలక్షేపం చేయొచ్చుగా" అని ఒక రోజెప్పుడో అడిగితే తన బాధంతా వెళ్ళబోసుకున్నాడు.

"మీరు రాకపోతే మరెక్కడైనా కూరగాయలు కొంటున్నారేమో ననుకున్నానమ్మా" అన్నాడు బుట్టలో ఏరిచ్చిన టమేటాల్ని త్రాసులో వేస్తూ

"నీ దగ్గర కాకుండా మరో చోట కూరగాయలు కొన్నా నాకు అరగవులే కనకయ్యా" అన్నాను.

మంచులా నవ్వాడు. ముందు నాలుగు పళ్ళు వూడిపోవటం వల్ల బోసి నవ్వులు నవ్వుతాడు.

"ఎలా ఉన్నారు నీ కొడుకులు" అని అడిగా.

"ఆళ్ళకేమండీ బాగానే ఉంటారు. నా మూడో కొడుక్కి వారం క్రితం కూతురు పుట్టిందట. దానికి పేరేం పెట్టారో తెలుసా అమ్మా... కనకమ్మ అని పెట్టారట. మా యింటావిడ పేరు. సచ్చి ఏలోకాన ఉందో తప్పకుండా మురిసి పోతుంది" తనూ మురిసిపోతూ చెప్పాడు.

కనకయ్యకు ముగ్గురు కొడుకులు. వాళ్ళు దుర్మార్గంగా యితన్ని తరిమేసినా వాళ్ళ వివరాలు ఎప్పటికప్పుడు కనుక్కుంటూ ఉంటాడు. ఒంగోలు నుంచి ఎవరైనా వస్తే చాలు కనకయ్యకు ఆ రోజు పండగే. కూరగాయల బండి కూడా వేయడు. పేరు పేరునా తన కొడుకులు కోడళ్ళు మనవళ్ళ క్షేమ సమాచారాలు కనుక్కుని మురిసిపోతుంటాడు.

కొద్దిసేపు మౌనంగా కూరగాయలు తూచటంలో మునిగి పోయాడు. అతని

మౌనంలో వేనవేల ఆలోచనల విస్ఫోటనాలు ఉండి ఉంటాయి. దుఃఖంతో అతని పెదవులు వణుకుతున్నాయి. దళసరి కళ్ళద్దాల వెనుక ఎన్నెన్ని కన్నీటి వరదల్ని రహస్యంగా దాచుకుంటున్నాడో...

ఒకట్రెండు సార్లు నా వైపు చూసి, చెప్పాలా వద్దా అని ఆలోచించుకుని, చెప్పకుండా ఉండలేననుకుని చెప్పాడు. "నేను సచ్చిపోతే నా శవం సూట్టానికి కూడా రారమ్మా. నీలాంటి ఏ మంచోళ్ల చేతుల మీదుగానో నా కట్టె కాలిపోతే సాలని దేవుణ్ణి వేడుకుంటుంటా"

నాకూ బాధనిపించింది. "అవేం మాటలు కనకయ్యా. రైతుగా ఎంత గౌరవంగా బతికావో ఇప్పుడూ అంతే గౌరవంగా నీ పొట్టకు కావాల్సింది నువ్వు సంపాయించుకుంటున్నావు. నువ్వు నిండా నూరేళ్ళు బతుకుతావు. చూస్తూ ఉండు నామాట నిజమౌతుంది"

"నా అన్న వాళ్ళు లేకుండా ఎన్నాళ్ళు బతికినా ఏం వుందమ్మా. కాకీ బతుకుతుంది నూరేళ్ళు. అందరూ ఉండి అనాథలా బతికే ఈ బతుకు పగవాళ్ళకూడా వద్దమ్మా" అన్నాడు.

నాకూ నిజమేననిపించింది. ఒంటరి బతుకు శాపమే... అందరూ ఉన్నా ఒంటరిగా బతకాల్సి రావటం మహా శాపం...

మరో నాలుగడుగులేసి పూలమ్మే మస్తానమ్మ దగ్గరకెళ్ళా. నన్ను చూడగానే తన ఎదురుగా గుట్టలుగా పోసి ఉన్న మల్లె దండల మాదిరి నవ్వింది. నాకు మస్తానమ్మ నవ్వు చూడటం చాలా ఇష్టం. నిష్కల్మషంగా, నిండుగా నవ్వుతుంది తన చక్కటి పలువరుస కన్పించేలా...

మస్తానమ్మకు ముప్పయికి దగ్గరగా ఉంటుంది వయసు. చాలా చక్కటి తెలుగు తెలంగాణా యాసలో మాట్లాడుతుంది. వాళ్ళది కరీంనగర్ అట. పెళ్ళయ్యాక మొగుడితో పాటు హైద్రాబాద్ వచ్చేసింది. మొగుడు ఆటో తోల్తాడట.

"గీ పూల్ల లేవా కన్పడకపోతివి" అంటూ నవ్వింది. 'నీ నవ్వు చాలా

బావుంటుందని' దీని మొగుడు చెప్పి ఉంటాడనుకుంటా అందుకే మాట మాటకీ నవ్వులు విసిరేస్తో ఉంటుంది. నా సమాధానం కోసం ఎదురు చూడకుండానే "పది మూరల పూలివ్వనా" అంది.

"పదెందుకు. నేనెప్పుడూ కొనేది ఐదు మూరలేగా"

"నాకు తెల్వకడుగుత. గా దేవుల్లకు పూలేస్తవు. మరి నువెట్టుకోవా"

"నాకెందుకో అంతగా ఇష్టం ఉండదు"

"గదేందమ్మా... ఆడమడిసివై ఉండి పూలెట్టుకోవా.... గీ దినం నేనిస్త. పెట్టుకో"

మస్తానమ్మ అలా పట్టు పట్టినట్లు మాట్లాడ్తుంటే ముచ్చటేసింది. "సరే ఇవ్వు. పెట్టుకుంటాను" అన్నాను. పది మూరలు కొలిచి, అందులోంచి సగం తెగ్గొట్టి "జరంత గట్ల తిరుగు. జడలో ఎడ్తాను" అంది.

నాకు ఇబ్బందిగా అన్పించింది. "పొట్లం కట్టివ్వు . ఇంటికెళ్ళాక పెట్టుకుంటాలే" అన్నాను.

"నేనొప్ప. నువ్వు మర్చిపోతావ్. జర గీవైపు తిరుగు" అంటూనే నేను తిరగనని అనుకుందో ఏమో లేచొచ్చి నా వెనక నిలబడి జడలో పూలు తురిమింది.

పది రూపాయల నోట్లు రెండివ్వబోతే "గిదేంటి... ఐదు మూరలకి పది రూపాయలేగా" అంది ఒక నోటు తీసుకుంటూ.

"నువ్విచ్చింది పది మూరలు కదా" అన్నాను అంత వెంటనే ఎలా మర్చిపోయిందా అని ఆశ్చర్యపోతూ...

"నేనిచ్చింది పది మూరలే. అమ్మింది ఐదు మూరలు" అంది మనోహరంగా నవ్వుతూ.

"ఈ పూలమ్మితే నీకు మిగిలేది ఎంతో నాకు తెలుసు. నాకు ఫ్రీగా వద్దు" పది రూపాయల నోటు ఆమె చేతిలో బలవంతంగా పెట్టే ప్రయత్నం చేశాను.

దెబ్బతిన్నట్లు నా వైపు చూసింది. "గీ యాపారం నా బతుకు తెరువు. నిజమే. గట్లని నా అక్క జళ్ళో పూలెట్టి పైసల్ తీస్కునే బద్మాష్‌దాన్ని కాదు"

"సరే. థ్యాంక్స్" అన్నాను జడలోని పూలని ఆప్యాయంగా నిమురుకుంటూ.

ఎప్పటికిమల్లే అద్భుతంగా నవ్వి "గట్లన్నవ్... మంచిగుంది" అంది.

తిరిగి యింటికొచ్చేప్పటికి ఏడు దాటింది.

"చూశావా అమ్మా ఎంత టైం వేస్టో.. మనింటి పక్కనే ఫుడ్ వరల్డ్ వచ్చిందనుకో... నీకీ శ్రమ ఉండదు" అంది మధు.

★ ★ ★

మా యింటికి వంద గజాల దూరంలో ఫుడ్ వరల్డ్ తెరిచారు. ప్రారంభోత్సవానికి సినిమా హీరోయిన్ని పిలిచి ఆర్భాటం చేశారు. చుట్టుపక్కల ఉన్న యిళ్ళన్నిటికీ తిరిగి పాంప్లెట్లు పంచారు. పేపర్లనిండా ప్రకటనలిచ్చారు.

గురువారం రాకముందే మధు తొందర పెట్టింది. "ఒక్కసారి ఈ సూపర్ మార్కెట్లకి అలవాటు పడ్డావంటే తర్వాత మానాలనుకున్నా మానలేవు. అమెరికా లాంటి దేశాల్లో ఇలాంటి మార్కెట్లే ఉంటాయి తెలుసా? మనలా రోడ్డు పక్కన బండ్లమీద కూరగాయలు అమ్మేవాళ్ళో, యింటింటికీ తిరిగి'టమేటాలు, పచ్చిమిరపకాయలు, పొట్ల కాయలో...' అంటూగొంతు పోయేలా అరుచుకుంటూ తిరిగేవాళ్ళో కన్పించరు. అమెరికాతో పోలిస్తే మనం ఎంతవెనకబడి ఉన్నామో చూడమ్మా. ఇపుడిపుడే కొద్దిగా అందుకునే ప్రయత్నం చేస్తున్నాం" అంది.

"సూపర్ మార్కెట్లు తెరిస్తే అభివృద్ధి సాధించినట్లా... యింటింటికీ తిరిగి కూరగాయలు అమ్ముకుంటే వెనకబడిఉన్నట్లా... నేను ఒప్పుకోను"

"అదే కాదమ్మా. ఒక ఉదాహరణ చెప్పనా? అమెరికా వాళ్ళు సెల్‌ఫోన్లు వాడటం ప్రారంభించిన పదిహేనేళ్ళకు మనదేశంలో సెల్‌ఫోన్లు ప్రవేశించాయి.

వాళ్ళకు ఐమాక్స్ థియేటర్లు అందుబాటులో కొచ్చిన చాలా యేళ్ళ తర్వాత మనకు ఐమాక్స్ థియేటర్ వచ్చింది. మనం ఈ పరుగులో వేగం పెంచకపోతే ఎన్నేళ్ళు గడిచినా అమెరికాతో పోల్చితే పాతికేళ్ళు వెనకబడి ఉంటాం. ప్చ్... తల్చుకుంటేనే దిగులనిపిస్తోంది"

"మానవ సంబంధాలు ఎంతగా మెరుగు పడ్తున్నాయనే దాన్ని బట్టి అభివృద్ధిని లెక్కవేయాలి తప్ప యాంత్రికతలో ఎంతటి నైపుణ్యాన్ని సాధించామనే విషయంలో కాదు"

"అమ్మా నీ తరం వేరు... ఈ తరం వేరు. అబ్బ వాదించింది చాల్లే. ఫుడ్ వరల్డ్‌కి వెళ్ళొద్దాం పద" అని బలవంతంగా లాక్కెళ్ళింది.

అతి విశాలమైన ప్రాంగణం... బియ్యం, కంది పప్పులాంటి దినుసులు ఒక వైపు... నవనవలాడే కూరగాయలు మరో వైపు... తాజా పండ్లు యింకో వైపు... కాస్మొటిక్స్‌కి వేరే గది...

అదో వినిమయ వస్తువుల ప్రపంచంలా ఉంది. మధు ట్రాలీని తీసుకుని, తనక్కావల్సిన వస్తువుల్ని ఏరుకుని అందులో వేసుకుంటోంది. కూరగాయల దగ్గరకొచ్చినప్పుడు చెప్పింది "చూశావా ఎంత ఫ్రెష్‌గా ఉన్నాయో? యిందులో పుచ్చులు, పాడైనవి అస్సలు ఉండవు. వాళ్ళే అలాంటివి తీసి పడేస్తారు"

కూరగాయలు పాలిథీన్ సంచుల్లో ప్యాక్ చేసి ఉన్నాయి. అవసరమనుకున్న వాటిని తీసుకుని ట్రాలీలో వేశాను. అక్కడ పనిచేసే వాళ్ళందరూ యూనిఫాం వేసుకుని ఉన్నారు. మాకు కొద్ది దూరంలో నిలబడిన ఒక ఉద్యోగి మమ్మల్ని గమనిస్తున్నట్లనిపించి వెనక్కి తిరిగి చూశాను. నిజమే... నాకు ఇబ్బందిగా అన్పించి మధుతో చెప్పాను. "మనమేదో దొంగలమైనట్లు అలా చూస్తున్నాడేమిటే"

మధు నవ్వింది. "అలాంటివి తప్పవు కదమ్మా. వాళ్ళూ వ్యాపారం చేసుకోవాలిగా. మనం దొంగలం కాదు. అలాగని ఇక్కడికి వచ్చేవాళ్ళలో దొంగలుండరని గ్యారంటీ ఏముంది? ఏ టూత్‌పేస్టో, ఫేస్ క్రీమో జేబులో

పెట్టుకుంటే చాలుగా. అందుకే కస్టమర్ల కదలికల్ని గమనిస్తుంటారు. అవన్నీ నీ కెందుకు? నీక్కావల్సినవేవో నువ్వు తీసుకో"

అదలా అన్నా నాకు మాత్రం చాలా ఇబ్బందిగా అన్పించింది. మేం ఎక్కడికి వెళ్ళినా మమ్మల్ని రెండు కళ్ళు వెంటాడుతూ... మేం ఏం తీసుకుంటున్నా మా చేతి కదలికల్ని గమనిస్తూ...

అక్కడ నాలుగు కౌంటర్లున్నాయి. ప్రతి కౌంటర్ దగ్గర ఇద్దరు ఉద్యోగులు ఉన్నారు. పొడవాటి క్యూలు...

మేమూ ఓ క్యూలో నిలబడ్డాం.... మా ట్రాలీతోపాటు.

పదిహేను నిముషాలకు పైగాపట్టింది కౌంటర్ని చేరుకోడానికి. ఒకతను మా ట్రాలీలో ఉన్న వస్తువుల్ని తీసుకుని తన ముందు పెట్టుకుని, ట్రాలీని పక్కకు నెట్టాడు. అతను ఒక్కో వస్తువు కంప్యూటర్ ముందు కూచున్న అమ్మాయికి అందిస్తే, ఆ అమ్మాయి సదరు వస్తువుని కంప్యూటర్ పైన రెండుసార్లు అటూ ఇటూ తిప్పి పక్కన పెడ్తోంది.

"ఏం చేస్తోందా అమ్మాయి?" అర్థం కాక మధునడిగా.

"దాన్ని బార్‌కోడ్ అంటారమ్మా. ప్రతి వస్తువుమీద ఒక కోడ్ ఉంటుంది. దాన్ని లేజర్ ఐ గుర్తించి ఆటోమేటిగ్గా దాని డిస్క్రిప్షన్ని, రేట్‌ని కంప్యూటర్‌లో ఫీడ్ చేసేస్తుంది. ఆ అమ్మాయి వస్తువుల్ని లేజర్ ఐకి ఎదురుగ్గా పెట్టి కోడ్ కన్పించేలా అటూ ఇటూ తిప్పుతోంది. టెక్నాలజీ అమ్మా" అంది.

డబ్బులిచ్చేటప్పుడు ఆ అమ్మాయి పలకరింపుగా నవ్వుతుందని ఎదురు చూసి నిరాశ పడ్డాను. రెండు ప్లాస్టిక్ సంచుల నిండా ఉన్న సరుకుల్ని చెరో సంచి మోసుకుంటూ ఇంటికి నడుస్తున్నప్పుడు "కనీసం ఒక్కరైనా పలకరింపుగా నవ్వనైనా నవ్వలేదేమిటే... రోబోట్లు పని చేస్తున్నట్లు చేశారు తప్ప" అంటూ మనసులో ఏర్పడిన వెలితిని వెళ్ళగక్కాను.

"ఏంటమ్మా నువ్వు మరీను... పలకరింపుగా నవ్వడానికి మనమేమైనా

స్నేహితులమా, బంధువులమా? వాళ్ళక్కడ ఉన్నది వస్తువుల్ని అమ్మడానికి... మనం వెళ్ళింది మనక్కావల్సిన వస్తువులు కొనుక్కోడానికి. కేవలం వ్యాపార సంబంధం. సింపుల్. అది సజావుగా సాగిందా లేదా? ఐనా పలకరింపుగా నవ్వితే ఏం వస్తుంది? ఏవిటీ లాభం?"

నాకేం సమాధానం చెప్పాలో తెలీలేదు. నిజమే. పలకరింపుగా నవ్వితే ఏమొస్తుంది? ఏమీ రాదు. నవ్వనంత మాత్రాన నష్టమూ లేదు. కానీ అలా ఎవరైనా మనల్ని చూసి పలకరింపుగా నవ్వితే మనసుకెంత హాయిగా ఉంటుందో... మనుషుల మధ్యే ఉన్నామన్న భద్రతా భావం... మనవాళ్ళే-మనసైన వాళ్ళేనన్న భరోసా...

* * *

మూడు వారాలనుంచీ ఫుడ్ వరల్డ్‌లోనే సరుకులు కొంటున్నాం. ఇప్పటికి ఆరేడుసార్లు వెళ్ళి ఉంటాను. ప్రతిసారీ కనీసం ఒక్కరైనా పల్కరిస్తారని ఎదురుచూడ్డం... నిరాశ పడటం... పల్కరించడానికి ఏముంటాయ్ అంటుంది మధు. ఏమీ ఉండవా? బోల్డుంటాయి... మాట్లాడటానికి మొదట మనసుండాలిగా... మాట్లాడకున్నా మానె కనీసం తమ ఎదురుగా మరో మనిషి ఉందన్న గుర్తింపు కోసమైనా నవ్వొచ్చుగా... సరుకులు మనుషుల దగ్గర కొంటున్నట్లు లేదు. మర మనుషులు తిరిగే షాపుకెళ్ళి యాంత్రికంగా కొన్నట్టే ఉంటోంది. ఏదో వెలితి... అనంతమైన శూన్యం... దుఃఖం జిగురులా అంటుకుని వదలట్లేదు.

రాపులమ్మా, కనకయ్యా, మస్తానమ్మా పదేపదే గుర్తుకొస్తున్నారు. మూడువారాలనుంచి కన్పించకపోతే మరలా జబ్బు పడ్డాననుకుంటున్నారేమో... ఇదీ ఓ రకమైన జబ్బే... సూపర్ మార్కెట్ల జబ్బు... మూడువారాలు పీడించింది. ఇక దీన్ని భరించే ఓపిక లేదు. విదిలించుకోవాల్సిందే.

గురువారం సాయంత్రం... సంచీ పట్టుకుని బయల్దేరాను. "ఎక్కడికమ్మా" అసలే పెద్దగా ఉండే కళ్ళని మరింత వెడల్పు చేస్తూ అడిగింది మధు.

"బడీ చౌడీకి... కూరగాయలు కొనడానికి"

"ఫుడ్ వరల్డ్ ఉందిగా. మూడువారాలనుంచీ అక్కడేగా కొంటున్నాం. బావున్నాయని నువ్వేగా అన్నావ్. కంప్లయింట్ ఏమీ లేదుగా"

"నాకుంది కంప్లయింట్. నేను మనుషుల దగ్గర కూరగాయలు కొనాలనుకుంటున్నాను."

"పక్కనే సూపర్ మార్కెట్ పెట్టుకుని బడీచౌడీకెళ్ళి కూరగాయలు కొంటే పిచ్చనుకుంటారమ్మా"

"ఔనే. నాకు పిచ్చే. మనుషుల్తో కలవాలనే పిచ్చి. మనసారా మాట్లాడాలనే పిచ్చి."

గుమ్మం బైటికొచ్చి చెప్పులు తొడుక్కుంటున్నప్పుడు "సరే వెళ్ళు. మరో కొన్ని నెలల్లో వాల్‌మార్ట్ కంపెనీ మనదేశంలో తన ఔట్‌లెట్లని తెరవబోతోంది. నీకు తెలుసా వరల్డ్‌వైడ్‌గా దానికి పదిహేను వందల ఔట్‌లెట్లున్నాయి. రిలయన్స్ గ్రూపు వాళ్ళు కూరగాయల అమ్మకాల కోసం 'రిలయన్స్ ఫ్రెష్' సూపర్ మార్కెట్లు ఓపెన్ చేశాక, వెళ్ళి కొందామన్నా బడీ చౌడీలో బండ్లుండవు. ఆ దెబ్బకు హాకర్లందరూ నెత్తిమీద చెంగేసుకుని బిచాణా ఎత్తేస్తారు" అంది మధు.

దాని మాటలు వినగానే నాకు భయమనిపించింది. నిజంగానే అలా జరిగితే... మస్తానమ్మ, కనకయ్య, రావులమ్మ... వీళ్ళందరూ ఏమైపోతారు? వాళ్ళ కళ్ళలో కదులాడే దిగులు నా ఎదురుగా ఘనీభవించి... సాంద్రత పెరిగీ పెరిగీ ఫెటిల్లున పేలిపోయి... వేన వేల శకలాలు వేన వేల గుండెల్లోకి దూసుకుపోతూ... జీవితాల్ని ఛిద్రం చేస్తూ...

బడీచౌడీలో ఆటో దిగంగానే నన్ను ఆప్యాయంగా పల్కరించిన చూపులు... నన్ను ఆత్మీయంగా కౌగిలించుకున్న పరామర్శలు...

వాళ్ళ మాటలు వింటున్నానన్న మాటే గానీ మనసంతా అలజడి... నన్ను తొలుస్తూ దిగులు... మధు చెప్పినట్లు జరిగితే వీళ్ళ బతుకులేమైపోతాయన్న

చింత...

"గీదినం పరేషాన్‌గున్నవు" అంది మస్తానమ్మ.

"ఏనుగు నడుస్తుంటే దాని నడక ఎంతందంగా ఉందీ, దాని శరీరం ఎంత భారీగా ఉందీ అని సంబరపడే మనుషులు దాని పాదాలకింద పడి నలిగి పోతున్న వేలాది చీమల గురించి ఎందుకాలోచించరూ అనే ఆలోచన వచ్చీ... దిగులేసి"

మస్తానమ్మ నావైపు వింతగా చూసి మధురంగా నవ్వింది. "సద్వు లేనోల్లం. మాకేం సమఝైతది నీ బాస" అంది.

ఆ నవ్వు ఎప్పటికీ చెరిగిపోకుండా ఉంటుందా....

కూరగాయల్తోపాటు వాళ్ళ కష్టాల్నీ కన్నీళ్ళనీ, సంతోషాల్నీ దుఃఖాల్నీ మోసుకొచ్చానేమో, ఆటో దిగి యింట్లోకి వెళ్తున్నప్పుడు సంచి చాలా బరువుగా అన్పించింది.

***(వార్త ఆదివారం. 14, నవంబర్ 2007)***

★ ★ ★